## క్లుప్తంగా

### భూ సమస్యలు పరిష్కరించాలి

**యాలాల:** పెండింగ్‌లోని భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం యాలాల తహసీల్దార్ వెంకటస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భూ భారతిలో మూడు నెలలుగా 300కు పైగా భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయంలో రెవెన్యూ ఉద్యోగులు దృష్టిసారించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, సీపీఎం మండల కార్యదర్శి బుగ్గప్ప, రాములు, గోపాల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### తోలుబొమ్మలాట శిక్షణ సర్టిఫికెట్ అందజేత


సీసీఆర్టీ డైరెక్టర్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న సరిత

**ధారూరు:** తోలుబొమ్మలాట శిక్షణ పూర్తి చేసుకున్న వారికి అధికారులు సర్టిఫికెట్ అందజేశారు. మండల పరిధిలోని నాగసమందర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని సరిత న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ అండ్ ట్రెనింగ్‌లో 15 రోజుల పాటు శిక్షణ పొందారు. జిల్లా నుంచి ఒక్కరే పాల్గొని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆమెకు సీసీఆర్టీ డైరెక్టర్ సర్టిఫికెట్ అందజేశారు. నూతన విద్యా కార్యక్రమంలో భాగంగా న్యూఢిల్లీలో నిర్వహించిన తోలుబొమ్మలాట శిక్షణలో పాల్గొని పూర్తి చేసినట్లు ఉపాధ్యాయిని తెలిపారు.

### కూల్చివేతలు బాధాకరం

- ఎంఐఎం తాలుకా అధ్యక్షుడు ఎస్‌బీ గుల్షన్
- అధికారులపై ఫిర్యాదు


సీఐ శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ముస్లింలు

**కొడంగల్:** రోడ్డు విస్తరణలో భాగంగా ముందస్తు సమాచారం ఇవ్వకుండా ముస్లింల నిర్మాణాలు కూల్చివేయడం బాధాకరమని ఎంఐఎం తాలుకా అధ్యక్షుడు ఎస్‌బీ గుల్షన్ పేర్కొన్నారు. బుధవారం కడ ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌బీ గుల్షన్ ముస్లిం నాయకులతో కలిసి సీఐ శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదన్నారు. అధికారులు తమకిష్టం వచ్చిన రీతిలో పట్టణంలోని దర్గా, శ్మశాన వాటికలు, ఇతర నిర్మాణాలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఫిరోజ్‌ఖాన్, సర్తాజ్ హుస్సేన్, షేక్ రోమన్, ముఖిద్, అజర్, సయ్యద్ ముస్తాఫా, షేక్ ఖలీద్, ఆబీద్, సయ్యద్ అర్షద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని నిరసన

అధికారుల తీరుపై మండిపడుతున్న గ్రామస్తులు


ప్లకార్డులతో నిరసన చేస్తున్న గ్రామస్తులు

**దోమ:** గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా త్రాగునీరు సక్రమంగా రావడం లేదని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ విషయం గురించి పలు మార్లు పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తే పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో పాటు గ్రామంలో నాళాలు, వీధులు అపరిశుభ్రంగా మారాయని, వీధి దీపాలు లేక అంధకారంలో మగ్గుతున్నామని మండిపడ్డారు. ఇప్పటికైన అధికారులు తమ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### పరామర్శ

**బంట్వారం:** అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోట్‌పల్లికి చెందిన నక్కల ఎల్లమ్మను చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందజేయాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం ఎల్లమ్మ కుమారుడు బందెయ్యతో మాట్లాడారు.

# పక్కాగా..లెక్క

- డిజిటల్ సర్వేతో మేలు
- పంట వివరాల సేకరణలో అధికారులు బిజీ
- క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్న ఏఈఓలు
- ప్రయోజనం పొందనున్న రైతన్నలు


వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి

**దోమ:** వానకాలంలో రైతులు సాగు చేసిన పంటలను ప్రభుత్వం పక్కాగా లెక్కించేందుకు డిజిటల్ సర్వేను ఉపయోగించుకోనుంది. దీనికోసం వ్యవసాయ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పంటల వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సర్వేలో భాగంగా వ్యవసాయధికారులు వివరాలను నమోదు చేసేందుకు బిజీ అయ్యారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో వెళ్లి పంటలను వారు పరిశీలిస్తున్నారు. వాటిని ప్రత్యేక యాప్‌లో నమోదుకు చర్యలు తీసుకుంటున్నారు.

**36 పంచాయతీలు..ఐదు క్లస్టర్లు**

దోమ మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో ఐదు వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో క్లస్టర్‌కు ఐదు నుంచి ఆరు గ్రామాలు ఉండగా వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో వెళ్లి పంటల వివరాలను నమోదు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మొదట గ్రామాల వారీగా సాగు విస్తీర్ణ వివరాలను సేకరించి ఆ తర్వాత ట్యాబ్‌లో నమోదు చేసేవారు. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా ఏఈఓలు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి సాగు విస్తీర్ణాన్ని పరిశీలించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

**22,682 ఎకరాల్లో సాగు**

డిజిటల్ సర్వేలో భాగంగా క్లస్టర్ వారీగా ఏఈఓలకు సూచించిన గ్రామాల్లో రైతు పేరు, సర్వే నంబర్, బ్యాంకుఖాతా, పట్టాదారు పాస్‌పుస్తకం, ఫోన్ నంబర్‌తో పాటు ఏఏ పంటలను సాగు చేశారనే వివరాలను సేకరించి నమోదు చేస్తారు. ఈ విధానంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పక్కాగా సాగు వివరాలు ఉండేలా పారదర్శకంగా పంటల సర్వే నిర్వహిస్తున్నారు. దోమ మండల వ్యాప్తంగా మొత్తం 19,857 మంది రైతులు ఉండగా, 22,682 ఎకరాల్లో వారు ఆయా పంటలను సాగు చేశారు. బుధవారం నాటికి వరి 13 వేల ఎకరాల్లో, కందులు 2,120, పత్తి 1,265, పెసర్లు 550 ఎకరాల్లో సాగు చేసినట్లు అధికారులు లెక్కలు తీసుకున్నారు. మిగత పంటల వివరాలను సైతం త్వరితగతిన లెక్కించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వివరిస్తున్నారు.

**మండలంలో సాగు వివరాలు ఇలా..**

| పంట రకం | ఎకరాల్లో |
|---|---|
| వరి | 16,210 |
| పత్తి | 1,830 |
| కంది | 2,450 |
| మొక్క జొన్న | 1,118 |
| జొన్న | 352 |
| పెసర | 640 |
| రాగులు | 16 |
| కూరగాయలు | 66 |
| మొత్తం | 22,682 |

### పంట విక్రయం సులభం



పంట వివరాలను క్షేత్ర స్థాయిలో పొలాలకు వెళ్లి నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ గ్రామానికి వెళ్లి ఏఏ పంటలు సాగు చేశారో తెలుసుకొని డిజిటల్ యాప్‌లో నమోదు చేస్తున్నాం. పంటల నమోదు వల్ల రైతులు సాగు చేసిన పంటను సులభంగా విక్రయించుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రతీ రైతు వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– బాబ్యు, ఏఈఓ, బ్రాహ్మణపల్లి క్లస్టర్

### పకడ్బందీగా నిర్వహిస్తున్నాం



పంటల నమోదును ఏఈఓలు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. గ్రామాలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో ఏఏ పంటలను సాగు చేశారో వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతీ రైతు పంటల వివరాలను నమోదు చేయిస్తే వచ్చిన దిగుబడిని విక్రయించుకోవడానికి ఎంతో మేలు జరుగుతుంది. రైతులందరూ ఏఈఓల వద్ద తప్పనిసరిగా నమోదు చేయించుకునేందుకు శ్రద్ధ తీసుకోవాలి. వివరాల నమోదును త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రభాకర్ రావు, మండల వ్యవసాయ అధికారి

# జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు

**మాజీ ఎంపీటీసీ రాఘవపురం రాములు**

**దోమ:** జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కల్పిస్తే ప్రతిఒక్కరికీ న్యాయం జరుగుతుందని బొంపల్లి మాజీ ఎంపీటీసీ రాఘవపురం రాములు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో పంచాయతీ రాజ్ చట్టం–2018 ప్రకారం అన్ని రిజర్వేషన్లు కలుపుకొని 50 శాతానికి లోబడి ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బీసీలకు ప్రస్తుతం ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఇందు కోసం ఆర్డినెన్స్ తీసుకువస్తుండడంతో అందులో వివిధ అంశాలు, జనాభా లెక్కలను బట్టి రిజర్వేషన్లు మారే ఆలోచనలు కనిపిస్తున్నాయి. కానీ 2025లో ప్రభుత్వం చేపట్టిన సర్వే ఆధారంగా బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తుండడం ఏ మాత్రం సరికాదని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను యథావిధిగా అమలు చేయనున్నారు. కేవలం బీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేస్తుండడం సముచితం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరగనుందని పేర్కొన్నారు.

# సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ


తాండూరు టౌన్: భద్రప్ప గుడిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**భద్రప్ప దేవస్థాన చైర్మన్ పటేల్ కిరణ్**

**తాండూరు టౌన్:** రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ అని భద్రప్ప దేవస్థాన చైర్మన్ పటేల్ కిరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి దేవాలయంలో దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని బతుకమ్మను కొలుస్తూ పాటలు పాడారు. మహిళల కోలాటం అత్యంత ఆకర్షణీయంగా కొనసాగింది. అనంతరం పటేల్ కిరణ్ మాట్లాడుతూ బతుకమ్మ సంబరాలను ఆలయంలో నిర్వహించడం సంతోషకరమన్నారు.


కుల్కచర్ల: బతుకమ్మ సంబురాల్లో మహిళ సమాఖ్య సభ్యులు, తదితరులు

**కుల్కచర్ల:** సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని కులకచర్ల ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మహిళ సమాఖ్యలో మహిళా సంఘాల ప్రతినిధులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీలు శ్రీనివాస్, వెంకట నర్సింలు, వెంకటయ్య, గణేశ్, పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

**మున్సిపల్ కమిషనర్ యాదగిరి**

**తాండూరు:** ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాండూరు మున్సిపల్ కమిషనర్ యాదగిరి పేర్కొన్నారు. బుధవారం తాండూరు మున్సిపల్ పరిధిలోని మల్‌రెడ్డిపల్లి ప్రాంతంలోని 1వ, 24వ వార్డుల్లో స్వచ్ఛత హీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ..వార్డుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులు దరిచేరవన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి ఇంటికొచ్చే సిబ్బందికి అందజేయాలన్నారు. అనంతరం వార్డు ప్రజలతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి, పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ మణిపాల్, మేనేజర్ నరేందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు వెంకటయ్య, ఉమేశ్, టీఎంసీ రాజేంద్రప్రసాద్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మల్‌రెడ్డిపల్లిలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ యాదగిరి


అనంతగిరి: పాతగంజ్‌లో అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొన్న మహిళలు


ధారూరు: వీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో కుంకుమార్చనలో మహిళలు

# కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఆయా మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అక్కడక్కడ అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు, రాజకీయ నాయకులు పాల్గొని ఆశీస్సులందుకుంటున్నారు.


అనంతగిరి: ఇంద్రానగర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న చిన్నారులు


కొడంగల్ రూరల్: భజన చేస్తున్న భక్తులు


ధారూరు: అన్నపూర్ణదేవిగా అమ్మవారు


కొడంగల్: అన్నదానం చేస్తున్న జగదీశ్వర్‌రెడ్డి

# పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు జగనమ్మ**

**దోమ:** పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు జగనమ్మ పేర్కొన్నారు. బుధవారం మోత్కూర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు సువర్ణ, మైబమ్మ, కిష్టమ్మ, దేవి, కవితలతో కలిసి పోషణమాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం జగనమ్మ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. అనంతరం వారు బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయాలు మంజుల, బుచ్చమ్మ, గ్రామ మహిళలు పాల్గొన్నారు.


గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న జగనమ్మ

# వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


తాండూరు రూరల్: హన్మపూర్ వైద్య శిబిరంలో నర్సిములు, తదితరులు


కుల్కచర్ల: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నాయకులు


బంట్వారం: వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

**వైద్యాధికారి కిరణ్‌కుమార్ గౌడ్**

**కుల్కచర్ల:** ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని వైద్యాధికారి కిరణ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేట్ కంటే మెరుగైన వైద్యం అందజేస్తున్నారన్నారు. అనవసరంగా ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా అవగాహనతో చికిత్స చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పరిధిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్య, నాయకులు జోగు వెంకటయ్య, క్రిష్ణారెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, జంగయ్య, వైద్య సిబ్బంది వెంకట్, అంజూ, రాజు నాయక్, పాల్గొన్నారు.

**వైద్య శిబిరానికి విశేష స్పందన**

**బంట్వారం:** కోట్‌పల్లి పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ శిబిరంలో 218 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మేఘన, సీహెచ్‌ఓ ఖయూం, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఏఎన్‌ఎంలు అంజలి, అపర్ణ, నర్సమ్మ, ప్రభావతి ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**ఆరోగ్యమే మహాభాగ్యం: లొంక నర్సిములు**

**తాండూరు రూరల్:** ఆరోగ్యమే మహాభాగ్యమని కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు, ఎల్ఎస్ఆర్ యువసేన వ్యవస్థాపకుడు లొంక నర్సిములు పేర్కొన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం హన్మపూర్‌లో ఎల్ఎస్ఆర్ యువసేన, హైదరాబాద్‌లోని శంకర్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ..హన్మపూర్ అభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉంటానన్నారు. గ్రామంలో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 30మందికి ఆపరేషన్ కోసం హైదరాబాద్ తరలించారు. హన్మపూర్ గ్రామాన్ని దత్తత తీసుకొని అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయిస్తామని శంకర్ ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హేమవతి, హర్షిణి, సిబ్బంది విజయ్, హరిప్రీత్, సోనమ్, సీనియర్ పాత్రికేయులు రాంచెందర్, పంచాయతీ కార్యదర్శి నర్సిములు, లొంక రాములు, వెంకటేశ్, సంగమేశ్వర్, విజయ్‌కాంత్, డీలర్ శ్రీను, శేఖర్, వెంకట్, సచిన్, బంటి, బలరాం, అజయ్, నరేశ్, రాము, ప్రవీణ్, రమేశ్ పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


దోమ: వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి**

**పరిగి:** అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో విగ్రహావిష్కరణ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 28న నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. భారత రాజ్యాంగాన్ని రచించిన మహోన్నతమైన వ్యక్తి అంబేడ్కర్ అని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీర్‌మహ్మద్, ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, రవికుమార్, మల్లేషం, అశోక్ పాల్గొన్నారు.

**విజయవంతం చేయాలి**

**దోమ:** కొండాయపల్లి గ్రామంలో ఈ నెల 28వ తేదీన ఆవిష్కరించనున్న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పరిగి పట్టణంలోని ఆయన నివాసంలో కొండాయపల్లి అంబేడ్కర్ సంఘం నేతలతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు.

# మత్తు పదార్థాలపై అవగాహన

**మర్పల్లి:** మండల పరిధిలోని శాపూర్, దామస్తాపూర్ తండాల్లో బుధవారం మోమిన్‌పేట్ ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం శాపూర్‌గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోమిన్‌పేట్ ఎక్సైజ్ సీఐ మహాదేవ్ మాట్లాడారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించడం వల్ల మానసికంగా శారీరకంగా హానికరమన్నారు. ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఎక్సైజ్ డీఎస్పీ ప్రేమ్‌కుమార్ రెడ్డి, తాండూర్ సీఐ శ్రీనివాస్, ఆయా మండలాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.